క్లుప్తంగా

టీపీఎల్ టోర్నమెంట్ విజేత గేమ్‌చేంజర్స్ జట్టు



అచ్చంపేట: గత 15రోజులుగా మండలంలోని తాళ్లచెరువులో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి టీపీఎల్ (తాళ్లచెరువు ప్రీమియర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌లో అచ్చంపేటకు చెందిన గేమ్‌చేంజర్స్ జట్టు విజేతగా నిలచింది. విజేత జట్టుకు శుక్రవారం గ్రామ సర్పంచ్ కిక్కురు అన్నమ్మ, వారి కుమారుడు అర్లారెడ్డి, ఫాదర్ ప్రతాప్‌రెడ్డిలు రూ.90వేల నగదు, తోర్నమెంట్ కప్ అందచేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఈ పోటీలలో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ఓటమితో క్రుంగి పోకూడదని, అదే విధంగా గెలుపుతో విర్రవీగకూడదని చెప్పారు. ఓటమి తదుపరి గెలుపుగా భావించాలని చెప్పారు. సర్పంచ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా తమ గ్రామంలో టిపిఎల్ టోర్నమెంటు నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలు గ్రామాల క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన రైతు తాళ్లూరి సామ్రాజ్యంకు చెందిన ఎద్దు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని హసనాబాద్ రోడ్డులో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. ఘటనా స్థలానికి మండల పశువైద్యులు డాక్టర్ మల్లయ్య చేరుకుని పరిశీలించడం జరిగింది. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. ఎద్దు నాలుగు సంవత్సరాలుంటాయని, సుమారు రూ. 40 వేలు ఖరీదుచేస్తుందని బాధితులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి తమకు తగిన నష్టపరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

పెదకూరపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బివి కృష్ణారావు శుక్రవారం తెలిపారు. కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన ఆర్తిమళ్ల వేణు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వేణు వద్ద 14 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని సత్తెనపల్లి అదనపు కోర్టులో హాజరుపర్చాగా 15 రోజులు రిమాండ్ విధిచినట్లు తెలిపారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండంలోని వివిధ గ్రామాల్లో గల సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు.

సేవా వజ్రగా వెలితోటి



పెదకూరపాడు: పెదకూరపాడు మండల సేవా వజ్రగా పొడపాడు వలంటీర్ వెలితోటి అనిల్‌కుమార్ ఎంపికయ్యారు. మండలంలోని పొడపాడు గ్రామంలో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ ఈ అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీఓ నరసింహరావు తెలిపారు.ఈ సందర్భంగా వలంటీర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనపై ఉంచిన నమ్మకాన్ని మరింత సేవరూపంలో ప్రజలకు అందిస్తానన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

రాజుపాలెం: మహిళలు ఆర్థికంగా స్థిరపడాలంటే ఇంట్లో ఉండే చేతి పనులు నేర్చుకోవాలని ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ శ్యాంసుందర్ తెలిపారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మహిళకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ శ్యాంసుందర్ మాట్లాడుతూ కారం, పిండి మిల్లులు, చిక్కిళ్లు, అప్పడాలు తయారు చేయడంపై అవగాహన కల్పించారు. పిండి మరలు, కారం మిల్లులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీపై లోన్లు ఇప్పిస్తామని తెలిపారు. డీబీఆర్‌సీ కోఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మహిళలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసరా, అమ్మ ఒడి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ భాజీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారు

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



అమరావతిలో నిరసన ర్యాలీ చేస్తున్న పార్టీ శ్రేణులు

అమరావతి: నిత్యం చంద్రబాబు నాయుడు తిట్టే పేద పేదప్రజలే ఆయనకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం అమరావతిలో ఇటీవల పేదలకు ఇచ్చే ఇళ్లస్థలాలు సమాధులు కట్టుకోవడానికేనన్న చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ గతంలో దళితుల్లో ఎవరైనా పుట్టాలను కుంటారా అని దళితులను కించపరిచే విధంగా అహంకార పూరిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు మరోసారి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల పట్ల తన వైఖరిని బయటపెట్టాడన్నారు. ఇపుడు సెంటు భూమి పేదలకు పంచి వారికి పక్కా ఇళ్లు కట్టిస్తుంటే చంద్రబాబు ఓర్వలేక చులకనగా మాట్లాడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న జగనన్నకు మీ అందరి ఆశీర్వాదం కావాలన్నారు. తొలుత స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ సాంబిరెడ్డి మాజీఎంపిపి వెంపాజ్వాలాలక్ష్మీనరసింహారావు జీడీసీసీ బ్యాంకు డైరక్టర్ కోట హరిబాబు, జడ్పిటీసీ ఈదుృగంటి కరుణకుమారి, జడ్పి కోఆప్షన్ మెంబర్ షేక్ హష్మీ సచివాలయాల కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు. పార్టీ నాయకులు మంగిశెట్టి కోటేశ్వరరావు, నిమ్మా విజయ సాగరబాబు,అళ్ల శ్రీనివాసరెడ్డి, ఆలా లక్ష్మీనారాయణ,చిల్కా సాంబయ్య, నందూరు కరుణకుమార్, ఎంద్రాయి, మునగోడు సర్పంచ్‌లు నాయుడు రాంబాబు, విష్ణులతోపాటు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అచ్చంపేట: ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చే ఇంటి స్థలాలను శ్మశానాలతో పోల్చిన చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో 50 వేలమంది నిరుపేదలకు ఇంటి నివేశన స్థలాలు కేటాయించడాన్ని కూడా రాజకీయం చేయడం చంద్రబాబుకే చెల్లుతుందన్నారు. తన 14 సంవత్సరాల కాలంలో ఒక్కసెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో సైతం ఇంటి స్థలాల కేటాయింపుల్లో ఎలాంటి తప్పులేదని తీర్పు చెప్పినా చంద్రబాబు ఇలాంటి దిక్కుమాలిన, నీతిమాలిన విమర్శలు చేయడం దారుణం అన్నారు. నిరుపేదలకిచ్చే స్థలాలను శ్మశానాలతో పోల్చిన చంద్రబాబు వెంటనే రాష్ట్ర ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో వేల ఎకరాల భూములను కొనుగోలు చేసి బలహీన, బడుగు వర్గాలవారికి ఇంటి స్థలాలుగా కేటాయించి, అనేక గ్రామాలు నిర్మించడాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు వ్యాఖ్యలు అమ్మపెట్టదు, అడుక్కుతిననీయదన్న సందాన ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, ఎన్జీరంగా యూనివర్శిటి మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, అచ్చంపేట, తాళ్లచెరువు సర్పంచ్‌లు కంబాల వీరబాబు, కిక్కురు అర్లారెడ్డి, వైస్ ఎంపీపీ తెల్లమేకల నాగరాజు, ఉపసర్పంచ్ షేక్ జాని, జిల్లా బీసీసెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, సొసైటి అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మాజీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నయల్లమందయ్య, సందెపోగు పున్నారావు, సంసోను, కరిముల్లా, గోపి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెదకూరపాడులో రోడ్డుపై ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పేదల ద్రోహి చంద్రబాబు

పెదకూరపాడు: పేదలకు సంక్షేమ పథకాలు అందినా, ఇళ్ల స్థలాలు ఇచ్చినా.. వారు ఆర్థికంగా బలోపేతం అయినా చంద్రబాబుకు నచ్చదని , చంద్రబాబు పేదల ద్రోహి అన్ని క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. ఇదేమికర్మమన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు నాయుడు శుక్రవారం చేసి వ్యాఖ్యలకు నిరసనగా పెదకూరపాడు మండల వైఎస్సార్ సీపీ శ్రేణులు మండిపడ్డాయి. నిరసన కార్యక్రమంలో భాగంగా పెదకూరపాడులోని కాలచక్ర రోడ్డుపై ధర్నా, బస్టాండ్ సెంటర్ నుంచి వైఎస్సార్ సీపీ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేదల ద్రోహి చంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ద్రోహి చంద్రబాబు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలోనే పేదలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అవుతున్నారని అది ఓర్వలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ షేక్ చాంద్ భాష, మండల సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, జిల్లా పార్టీ కార్యదర్శులు కంకణాల శివాజి, బచ్చు హనుమంతురావు, బత్తుల కోటేశ్వరరావు, మైనేని నరేంద్ర,షేక్ బాజి, రహం, నల్లపాటియోహన్, ఎంపీటీసీ బాజి, రామకృష్ణ, కల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

88 త్యాళ్లూరులో గ్రామోదయం

88త్యాళ్లూరు (క్రోసూరు): మండలంలోని 88త్యాళ్లూరులో మండల ప్రత్యేక అధికారి డీఎస్‌వో పద్మశ్రీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య , మండల అధికారులతో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలోని గృహనిర్మాణాలు పరిశీలించారు. ఎస్‌డబ్ల్యుపీసీ పరిశీలించి క్లాప్‌మిత్రలతో బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం గ్రామంలోని సబ్‌సెంటర్ పరిశీలించి అక్కడికి వచ్చిన రోగులతో ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్లు పరిశీలించడం జరిగింది.

ఎర్రబాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు..

మండలంలోని ఎర్రబాలెంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామోదయం అధికారులు పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ విధుల్లో ఉన్న డాక్టర్ బాల అంకమ్మబాయితో మాట్లాడారు. అక్కడి రోగులను ఉద్దేశించి మండల ప్రత్యేక అధికారి పద్మశ్రీ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లంకెలకూరపాడు(ముప్పాళ్ళ): మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరై గ్రామంలోని ఎస్సీ కాలనీని, అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఆరోగ్య ఉపకేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఆరోగ్య ఉపకేంద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని సాలిడ్‌వేస్ట్‌మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని సందర్శించి క్లాప్‌మిత్రలతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీఏ కాంతారావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, పీహెచ్‌సీ వైద్యులు పీ.రమాదేవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ ఒంగోలురాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



లంకెలకూరపాడులో గ్రామోదయంలో పాల్గొన్న మండల స్థాయి అధికారులు

పచ్చిరొట్ట ఎరువుల్లో అధిక పోషకాలు

జిల్లా వ్యవసాయాధికారి మురళి



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: పచ్చిరొట్టే ఎరువుల్లో అధిక పోషకాలు ఉంటాయని, వాటి ద్వారా భూసారం పెంపొంది అధిక దిగుబడులు సాధ్యపడతాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడువాయిలో శుక్రవారం జరిగిన రైతు అవగాహన సభలో ఆయన పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జనుము విత్తనాలను 50శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. వీటితోపాటు హైబ్రిడ్ కంపెనీకి చెందిన ఆర్మూర్ రకం మిర్చి విత్తనాల ప్యాకెట్స్ కూడా రైతులకు అందచేశరు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దుక్కులు దున్నుకుని పంటకు సిద్ధంగా ఉంచుకున్న భూమిలో పచ్చిరొట్టె విత్తనాలు వేసుకోవాలన్నారు. పూతదశకు రాగానే రోటివేటర్ ద్వారా భూమిలో కలియదున్నుకోవాలని చెప్పారు. అలా చేయడం వల్ల భూమికి సేంద్రీయ పదార్థం పుష్కలంగా లభిస్తుందన్నారు. ప్రతి రైతుభరోసా కేంద్రంలో పచ్చిరొట్టె విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జీలుగ 10కిలోల ప్యాకెట్ ధర రూ.790లుకాగా, 50శాతం సబ్సిడీపై రూ.395లకు, జనుము రూ.840కుకాగా రూ.420లకు, పిల్లిపెసర రూ.776లుకాగా 388లకు లభిస్తాయని చెప్పారు. రైతులంతా ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. దాని ద్వారా పంట నష్టం జరిగినపుడు పంట భీమా, పండిన పంటకు మద్దతుధర లభిస్తుందని చెప్పారు. లైసెన్స్‌లున్న డీలర్ల వద్ద సీల్డ్ ప్యాక్‌తో విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని, వాటికి బిల్లులు తీసుకొని పంటకాలం పూర్తయ్యేంతవకు భద్రపరచుకోవాలని చెప్పారు. కౌలు రైతులంతా పంటసాగు పత్రాలను పొంది వాటి ద్వారా బ్యాంకులలో వడ్డీలేని రుణాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ డిఎం జి.సుబ్బయ్య, వ్యవసాయ సహాయ సంచాలకు వి.హనుమంతరావు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అప్పు అడిగినందుకు దాడి

ముప్పాళ్ళ: తనకు ఇవ్వాల్సిన రూ.200 లు ఇవ్వాలని అడిగినందుకు దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇమామ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ఇరుకుపాలెం గ్రామానికి చెందిన షేక్‌మహమ్మద్‌సిద్దిక్ అనే యువకుడికి అదే గ్రామానికి చెందిన యర్రసానిమార్క్ అనే యువకుడు రూ.200లు అప్పు ఉన్నాడు. ఈ నేపథ్యంలో సిద్దిక్ తనకు ఇవ్వాల్సిన రూ.200 ఇవ్వాలని యర్రసానిమార్క్‌ను అడిగాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాదనలు జరిగి సిద్దిక్ పై మార్క్ దాడి చేయడంతో తలకు గాయమైంది. జరిగిన ఘటనపై సిద్దిక్ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇమామ్ తెలిపారు.

మూడు ఆలయాల్లో గంటలు చోరీ...

మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని మూడు ఆలయాల్లో ఇత్తడిగంటలు చోరీకి గురైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని శ్రీజగన్నాథస్వామి ఆలయం, శ్రీలింగమయ్యస్వామి ఆలయం, శ్రీఆంజనేయస్వామి ఆలయాల్లో ఉన్న సుమారు 10 గంటలు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గతంలోను శ్రీజగన్నాథస్వామి ఆలయంలో గంటలు చోరీకి గురయ్యాయని వారు తెలిపారు.

అనుపాలెంలో 95 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ శుక్రవారం వైద్య సేవలు అందించారు. డాక్టర్ కృష్ణకుమార్ 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. 34 మందికి బీపీ, 27 మందికి షుగర్ బిల్లలను అందించారు.15 మంది గర్భిణులు, ఏడుగురు బాలింతలకు వైద్య పరీక్షలు అందించి అవసరమైన మందులను పంపిణీ చేవారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి అరుణ, ఎంపీడీవో టి.శ్రీనివాసరావులు ఫ్యామిలీ డాక్టర వైద్య విధానాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లిఖార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి దేవానాయక్,శిరీష, ఏఎన్ఎంలు కమల,రాజు, డిఈఓ చెవుల పూర్ణచంద్రరావు, ఆశా కార్యకర్తలు మాధవి, ధనలక్ష్మీ, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజుపాలెం: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మండలంలో అన్ని గ్రామాల్లో నేడు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ వీవీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నకరికల్లులో

నకరికల్లు : విద్యుత్ 33 కేవి లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని చేజర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని చేజర్ల, కుంకలగుంట, పాపిసెట్టిపాలెం, జిల్లాపేటతండా గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ రూఫస్ డానియేల్ శుక్రవారం తెలిపారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల



నకరికల్లు: స్థానిక కొండపై గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల శనివారం నిర్వహించనున్న సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అతిపురాతన చరిత్ర కలిగిన శ్రీ ఆదిలక్ష్మీ చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనర్సింహస్వామి తిరునాళ్ల 5వతేదీ నిర్వహించాల్సి ఉండగా వర్షాల కారణంగా ఈనెల 20వతేదీకి మార్పు చేశారు. కల్యాణం యధావిధిగా జరిపించి గత 16 రోజులుగా స్వామివారి ఊయలపాన్పు సేవలు భక్తిశ్రద్ధలతో జరిపిస్తున్నారు. కల్యాణం అనంతరం 16 రోజుల పండుగ సందర్భంగా భక్త సంఘం ఆధ్వర్యంలో తిరునాళ్లకు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వేలాదిగా తరలివచ్చే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైద్యశాలలో రక్తపరీక్షలకు సాంకేతిక పరిజ్ఞానం

- గంటలో 60 శాంపిల్స్‌కి సంబంధించిన 640 టెస్టులు చేసే సదుపాయం
- రూ.25 లక్షల విలువైన ఫుల్లీ ఆటోమేటెడ్ క్లినికల్ బయో కెమిస్ట్రీ ఎన్‌లైజర్ ప్రారంభం



పట్టణంలోని ఏరియా వైద్యశాలలో యంత్ర పరికరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలతో పేద వర్గాలకు మేలు చేస్తుందని, ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో రూ. 25 లక్షల విలువైన ఫుల్లీ ఆటోమేటెడ్ క్లినికల్ బయో కెమిస్ట్రీ ఎనలైజర్‌ను ప్రభుత్వం అందించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం ఈ యంత్ర పరికరం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ పరికరం 60 రక్త శాంపిల్స్‌కు సంబంధించిన 53 రకాల పరీక్షల రిపోర్టులు అందిస్తోందన్నారు. గంటకు 640 టెస్టులు ఈ యంత్రం ద్వారా చేయవచ్చన్నారు. వైద్య పరీక్షలు వేగంగా రావడం ద్వారా వైద్యులు సకాలంలో రోగికి అవసరమైన చికిత్స అందించేందుకు వీలుంటుందన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌కు ధీటుగా ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో సేవలందించి రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఫిజియో థెరపీ కేంద్రాన్ని మంత్రి అంబటి రాంబాబు పరిశీలించారు. రోజుకు ఎంతమంది వస్తున్నారు? వైద్య సేవలు ఎలా చేస్తున్నారు? పరికరాలు ఉన్నాయా? లేవా..? అని సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిరంగిపురం మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన చిన్నారి తల్లి కొలకలూరి అనూషాని సేవలు ఎలా ఉన్నాయి అని అడిగారు. గతంలో కన్నా 80 శాతం మెరుగైన నడక పాపకు వచ్చిందని సంతోషంగా అనూషా మంత్రి అంబటి రాంబాబుకు వివరించింది. రక్తపరిక్ష ల్యాబ్‌కు అవసరమైన టేబుల్, ఏసీని అందించిన ల్యాబ్ సిబ్బంది మహమ్మద్ అలీని ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. అలీ సేవలను మంత్రి అంబటి కొని యాడారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన మెడికల్, నర్సింగ్ సిబ్బందిని మంత్రి అంబటి రాంబాబును పూల మాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఫుల్లీ ఆటోమేటెడ్ క్లినికల్ బయో కెమిస్ట్రీ ఎన్‌లైజర్ యంత్ర పరికరాన్ని మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. ఏరియా వైద్యశాల అభివృద్ధికి సేవాదృక్పథంతో ఇతోధికంగా కృషి చేస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ను మంత్రి అంబటి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, ఏరియా వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు, ఫిజియోథెరపీలు అమర్తలూరి జీవనజ్యోతి, నందిగం కరుణాకర్, వైద్యులు, పట్టణ, మండలాలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



లక్కరాజుగార్లపాడులో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

సత్తెనపల్లి: ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామంలో శుక్రవారం సత్తెనపల్లి పీపీ యూనిట్ వైద్యాధికారిణి డాక్టర్ అనూష రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 155 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జనరల్ ఓపి 19 మంది, హైపర్ టెన్షన్ 56 మంది, డయాబెటిస్ 21 మంది, హైపర్‌టెన్షన్ అండ్ డయాబెటీస్ 26 మంది, గర్భవతులు 19 మంది, బాలింతలు ముగ్గురు, జ్వరాల కేసులు ముగ్గురు, బెడ్ రైటింగ్ ముగ్గురు, చిన్నారులు ముగ్గురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారు లకు ఆరోగ్య బోధన చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె. సంపూర్ణాదేవి, సిహెచ్ఓ కె.సురేష్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ పి నాగేశ్వరరావు, డీఇఓ ఇజ్రాయిల్, ఆశా కార్యకర్తలు సుధా, షారోన్, విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

నందిగామ గ్రామంలో....

సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ శుక్రవారం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 226 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో జనరల్ ఓపి 33 మంది, హైపర్ టెన్షన్ 63 మంది, డయాబెటిస్ 38 మంది, హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిస్ 91 మంది, గర్భవతులు 12 మంది, బాలింతలు ఇరువురు ఉన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందుల అందించడంతో పాటు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య బోధన చేశారు. సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి సుధాకర్ హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జె. సంపూర్ణాదేవి, ఎంఎల్‌హెచ్‌పి వి.కౌసల్య, ఏఎన్ఎం జి.నాగమల్లేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ షేక్.సుభాని, ఆశా కార్యకర్తలు పి.శివపార్వతి, కోటేశ్వరమ్మ, ఎం.నాగలక్ష్మి ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు

నకరికల్లు: ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాలు ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడీసిఎంఎస్ ద్వారా మొక్కజొన్నను క్వింటా రూ. 1962లకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో 427 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేశామన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్ద మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ముందుగా ఖరీఫ్‌సాగుకు సమాయత్తం కార్యక్రమం నిర్వహించి రైతులకు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓ కె.హనుమంతరావు, జీడిసిఎంఎస్ ఇన్‌చార్జి షేక్.ఈసూబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తుల సమస్యలకు త్వరలో పరిష్కారం

పల్లెనిద్రలో అధికారుల హామీ



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఎంపీడీవో జిలానీ బాషా

వినుకొండ(నూజెండ్ల): పల్లెనిద్రలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్ని త్వరలోనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నూజెండ్ల మండలం పుచ్చనూతల పంచాయతీ పరిధిలోని రవ్వవరంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవిబాబు, ఎంపీడీవో షేక్ జిలానీ బాషాలు గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. ప్రజల నుంచి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అన్ని శాఖల సిబ్బందితో సమీక్ష నిర్వహించి గ్రామ ప్రజల సమస్యల్ని త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో కరెంటు, పారిశుద్ధ్య సమస్యల్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలి

ఈపూరు: మండలంలోని ఎర్రగుంట తండాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన శైలిలో భాగంగా అడవుల సంరక్షణపై శుక్రవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అటవీ సంరక్షణలో భాగస్వామ్యులు కావాలని కోరారు.